క్లుప్తంగా

యూబీఐ సేవలను ఉపయోగించుకోండి



తెనాలి అర్బన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను అందరూ ఉపయోగించుకోవాలని ముంబయిలోని సెంట్రల్ ఆఫీస్ చీఫ్ జనరల్ మేనేజర్ బిజు వాసుదేవన్ పేర్కొన్నారు. తాడిబోయినవారి వీధిలోని బ్యాంకు కార్యాలయంలో మంగళవారం ఎంఎస్ఎంఈ మెగా అవుట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ లోన్‌లకు సంబంధించిన మంజూరు పత్రాలను ఖాతాదారులకు అందించారు. బ్యాంక్ గుంటూరు రీజియన్ హెడ్ ఎస్.జవహర్, బ్యాంకు మేనేజర్ శ్యామ్ సన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి అర్బన్: రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివ లింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. డాక్టర్ వీరమాసునేని రఘురామ్ జ్ఞాపకార్థం బాలాజీ డెవలపర్స్ అధినేత పరుచూరి శ్రీనాథ్‌బాబు ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, పరుచూరి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవన విధానంలో మార్పు అవసరం



తెనాలి టౌన్: ప్రతి ఒక్కరూ మంచి జీవనశైలి అలవాటు చేసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని శబరి వెల్‌నెస్ సెంటర్ నిర్వాహకులు సుష్మిత రమేష్ సూచించారు. ఒబేసిటీ డే సందర్భంగా మంగళవారం రజక చెరువు కంచె ఐలమ్మ పార్కులో వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ఇషారేద్ ఖాన్, మాధవి, పార్వతి, కుమారి, తదితరులు ఉన్నారు.

ఘనంగా సత్సంగ కేంద్రం వార్షికోత్సవం



తెనాలి రూరల్: మండల గ్రామం అంగలకుదురులోని సాయిబాబా సత్సంగ కేంద్రం 30వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు పలు ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నదానం చేశారు. సత్సంగ కేంద్రం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మేనేజర్ సేవలు మరువరానివి



తెనాలి అర్బన్: తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేసిన దేవసేన సేవలు మరువరానివని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. దేవసేన వీడ్కోలు సభను మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు, ఆర్‌వో రామ్‌ప్రసాద్, డీఈ సుబ్బారావు, ఏసీపీ శివన్నారాయణ పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌కు 'వేసవి' ముప్పు

- 200 యూనిట్ల లబ్ధిదారులకు తప్పని భారం
- ఒక్క యూనిట్ పెరిగినా పథకానికి అనర్హులే
- ఎస్సీ, ఎస్టీలు పొదుపు పాటించాలని యంత్రాంగం సూచన
- నానాటికీ ప్రతాపం చూపుతున్న ఉష్ణోగ్రతలు
- ఇప్పటికే పెరిగిన ఏసీలు, కూలర్‌లు, ఫ్యాన్ల వాడకం



విద్యుత్ సబ్ స్టేషన్

కొల్లిపర: వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో ఎండ వేడిమికి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాపం నుంచి తప్పించుకునేందుకు ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లను వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. మండలంలోని 20 గ్రామాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కింద లబ్ధిదారులకు ఇప్పటివరకు జీరో బిల్లులను అందించారు. 200 యూనిట్లు దాటితే వారికి బిల్లు భారం పడుతోంది. మండలంలో దీని కింద 4,879 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రతి నెలా సుమారు రూ.50 లక్షల విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తోంది. వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరిగిపోవడంతో 200 యూనిట్లు దాటిన వారంతా బిల్లులు చెల్లించాల్సి వస్తోంది.

18 వేల మంది గృహ వినియోగదారులు

మండలంలోని 20 గ్రామాల పరిధిలో 18,165 విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో 4,879 మంది 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వినియోగించుకుంటున్నారు. ఫిబ్రవరి నెలలో 52 మందికి 200 యూనిట్లు దాటగా.. వారికి బిల్లు అందజేశారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు గతంతో పోల్చుకుంటే ఇంకా పెరిగే అవకాశం ఉంది. అధికంగా విద్యుత్ వినియోగించే వారి సంఖ్య రెండు, మూడు నెలల్లో మరికొంత పెరగనుంది. ఉచిత విద్యుత్ యూనిట్ల పరిమితి దాటితే బిల్లులు చెల్లించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. విద్యుత్‌ను పొదుపు చేయడం ద్వారా లేదా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో సౌర పలకలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా బిల్లు భారం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

ఎండాకాలం వేడి నుంచి తట్టుకునేందుకు ఏసీలు, కూలర్లు వినియోగిస్తారు. అవసరమున్న సమయంలో మాత్రమే వాటిని వాడుకుంటూ విద్యుత్‌ను పొదుపు చేసుకోవాలి. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 200 యూనిట్లు వరకు ఇస్తోంది. ఆ పరిమితి దాటితే బిల్లు చెల్లించాల్సి వస్తుంది.

– ప్రదీప్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ, కొల్లిపర మండలం

ఘనంగా మహిళా దినోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ గోగినేని ఉమ, అమృతరాణి



మహిళల సాంస్కృతిక ప్రదర్శన

తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్ 12వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వేడుకల్లో వందల మంది మహిళలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.అమృతరాణి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం శుభపరిణామంగా డాక్టర్ ఉమ చెప్పారు. మహిళలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. నృత్యాల్లో మహిళలు సందడి చేశారు. ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ డి.జీవనలత పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో ట్రస్ట్ సభ్యులు చుండూరు వరలక్ష్మి, జి.జ్యోతికాంత్, ఎస్.లక్ష్మీఅలేఖ్య, పి.వసంతదుర్గ, టి.గాయత్రి, జి.లీలారాణి, జె.సృజన, జి.అనూరాధ, టి.జ్యోతి, ఆర్.రత్నశ్రీ, వేడుకలకు సహకరించిన వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల స్థితిగతుల మెరుగే లక్ష్యం



వేడుకల్లో సభ్యులు, రైతులు

తూములూరు(కొల్లిపర): భారతీయ కిసాన్ సంఘ్ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు రైతుల స్థితిగతులను మెరుగుపరచడం లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక సంస్థ బి.కె.ఎస్. అని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగా సాంబిరెడ్డి, జిల్లా అధ్యక్షులు కొండా కిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం భారతీయ కిషాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవాలు సభ్యులు, కార్యవర్గ సభ్యులు, మండలంలోని తూములూరు గ్రామంలోని ప్రధాన కూడలిలో రైతులతో కలిసి ఘనంగా నిర్వహించారు. కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పంటకు మద్దతు ధర కోసం కిషాన్ సంఘ్ పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు వింతా వేణుగోపాలరెడ్డి, కన్నెగంటి విజయకుమార్, బద్దిగం నాగిరెడ్డి, గాదె కుటుంబరెడ్డి, ఈదా శంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

త్వరలో ఎస్‌టీపీ ప్రారంభం



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాస్, కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: పూలే కాలనీలో నూతనంగా నిర్మించిన ఎస్‌టీపీ ప్లాంట్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ప్లాంట్‌ను పరిశీలించారు. ట్రయల్ రన్ నిర్వహించారు. అక్కడ చేయాల్సిన పనులపై ఆరా తీశారు. చిన్న పనులు పెండింగ్‌లో ఉండటాన్ని గమనించిన ఆయన వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, పబ్లిక్ హెల్త్ డీఈ శివరామకృష్ణ, ఏఈ ఫణి, తదితరులు ఉన్నారు.

ఆస్తి కోసం కొడుకు వేధింపులు



ఆవేదన వ్యక్తం చేస్తున్న శ్రీనివాస్, తులసి దంపతులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో కన్నతండ్రిని, పెంచిన తల్లిని ఓ కసాయి కుమారుడు ఆస్తికోసం హింసించాడు. ఆ బాధలు భరించలేక మంగళవారం బాధితులు 100కు డయల్ చేయడంతో జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులైన శ్రీనివాస్, తులసి దంపతులు కొన్ని సంవత్సరాల నుంచి రాధారంగా నగర్‌లో నివాసముంటున్నారు. 2021 నుంచి కుమారుతు త్రినాథ్‌ద్ ఆస్తికోసం హింసిస్తున్నాడని వారు వాపోయారు. గత వారం దాడికి పాల్పడుతున్నాడని, ఇక తట్టుకోలేక తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఎవరైనా రాజకీయ నాయకులతో తమకు చెప్పించాలని పోలీసులు అంటున్నారని, ఈ వయసులో తమకు రాజకీయాలతో ఏమి సంబంధమన్నారు.

పరీక్షల్లో విద్యార్థులు మెలకువలు పాటించాలి



సూచనలిస్తున్న డిప్యూటీ డీఈవో జి.శాంతకుమారి

తెనాలి టౌన్: పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో మెలకువలు పాటించాలని తెనాలి డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి జి.శాంతకుమారి సూచించారు. రూరల్ మండలం కఠెవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి పబ్లిక్ పరీక్షల్లో పాటించాల్సిన మెలకువలను తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తాటి శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయంపై న్యాయవాదుల హర్షం

తెనాలి రూరల్: ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కొత్తపేటలోని కోర్టు వద్ద తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాస రావు, మద్ది మల్లికార్జున రావు తదితరుల నేతృత్వంలో ఎమ్మెల్సీగా ఆలపాటి విజయం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి హరిదాస్ గౌరీ శంకర్, న్యాయవాదులు ఆర్.అనిత, సీహెచ్.శారద, బొంత వీరాంజనేయులు, వి.జయప్రకాష్, అప్పల కిషోర్ కుమార్, హరీష్, టి.కొండయ్య, నన్నపనేని రవికృష్ణ, రవి, డి. శ్రీకాంత్, బి. ఫణిబాబు, కోటేశ్వరరావు, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'శిశిరం' సినిమా షూటింగ్

తెనాలి: శ్రీ కృష్ణ ఆర్ట్స్ పతాకంపై తెనాలికి చెందిన కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో రూపొందుతున్న బాలల సినిమా 'శిశిరం' షూటింగ్ తెనాలి పరిసర ప్రాంతాల్లో శరవేగంగా కొనసాగుతోంది. స్థానిక చినరావూరులోని మంగళవారం జరిగిన షూటింగ్‌ను వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత క్లాప్ కొట్టి ప్రారంభించారు. చిత్ర దర్శకుడు కనపర్తి రత్నాకర్ వివరాలను తెలియజేశారు.

బాలికలు విద్యను అందిపుచ్చుకోవాలి

తెనాలి టౌన్: రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తున్న ఇంటర్మీడియట్ విద్యను బాలికలు అందిపుచ్చుకోవాలని బీఎస్ఆర్ అండ్ జేడీఎం జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు కె.సీతారామమూర్తి సూచించారు. మంగళవారం స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు.

కూల్ డ్రింక్స్ వాహనం బోల్తా

కొల్లిపర: మండల పరిధిలోని అన్నవరం గ్రామం సమీపంలోని కృష్ణా నది కరకట్ట రహదారిపై ప్రమాదవశాత్తు కూల్ డ్రింక్స్ వాహనం బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వాహనంలోని కూల్ డ్రింక్స్ మట్టి పాలయ్యాయి. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

గ్రంథాలయం తనిఖీ

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి శాఖా గ్రంథాలయాన్ని గుంటూరు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి. సుబ్బరత్నమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి నాగూర్ బాషా మాట్లాడుతూ తాడేపల్లి గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను త్వరలో పంపిణీ చేస్తామని సుబ్బరత్తమ్మ చెప్పారన్నారు.

పంచాయతీరాజ్ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

తాడికొండ: మండల పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక సోమవారం మండల పరిషత్ కార్యాలయం జరిగింది. ఏపీ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నికున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యక్షుడిగా లాం కార్యదర్శి బి.అరుణ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా షేక్ మొహమ్మద్ షరీఫ్, ట్రజరర్‌గా షేక్ రెహమాన్, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.లీలా ప్రసన్న, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.మల్లేశ్వరి, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్. అనిల్, జాయింట్ సెక్రటరీగా ఎం.సౌజన్యలను ఎంపిక చేసినట్టు ప్రకటించారు. ఈసందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని తాడికొండ ఎంపీడీవో కె.సమతావాణి అభినందించారు.

హెల్తీ ఉమెన్ - హ్యాపీ ఉమెన్

తాడికొండ: మండలంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా హెల్తీ ఉమెన్ - హ్యాపీ ఉమెన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సి.హెచ్.కళావతి పాల్గొన్నారు. రక్తహీనత నివారణకు గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తయారీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

13 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో చైర్మన్ శివకుమార్, డాక్టర్ రామ్‌చంద్

తెనాలి: ఇన్ఫోసిస్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు 13 మంది 'సాఫ్ట్‌వేర్ అసోసియేట్స్' ఉద్యోగాలకు ఎంపికైనట్టు ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. కాలేజీలో మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని నాన్ ఇంజినీరింగ్ కేటగిరీ అభ్యర్థులకు ఇన్ఫోసిస్ చేసిన ఇంటర్వ్యూల్లో గుంటూరు జిల్లా నుంచి కేవలం 29 మందిని ఎంపిక చేసుకోగా, అందులో 13 మంది తమ కాలేజీ బీసీఏ/బీఎస్సీ కంప్యూటర్స్ ఫైనలియర్ విద్యార్థులని చెప్పారు. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షలుగా తెలిపారు. విద్యార్థులకు తొలి ఏడాది నుంచి లైఫ్ స్కిల్స్ శిక్షణ అందిస్తామన్నారు వివిధ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలతో ఆయా కోర్సులకు తగిన సర్టిఫికేషన్స్ చేసేలా శిక్షణ ఇస్తున్నామని గుర్తుచేశారు. ఫలితంగానే కాలేజి నుంచి బయటకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఉపాధి కలుగుతోందని వివరించారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ ఇన్ఫోసిస్ కంపెనీ కోడింగ్ టెక్నిక్‌తో నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియను తమ విద్యార్థులు సమర్థంగా హాజరు కాగలిగారని చెప్పారు. ఎంపికైన వారిని అభినందించారు.

మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు కీలకం



కఠెవరంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటలక్ష్మి

తెనాలి టౌన్: మొక్కజొన్న సాగులో చీడపీడల నివారణకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటలక్ష్మి సూచించారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో మంగళవారం రైతు శిక్షణ, పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. రైతులకు మొక్కజొన్నలో చీడపీడల యాజమాన్య పద్ధతులు, రబీ పంట అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శివకుమార్ , తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఉషారాణి, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, కఠెవరం వీఏఏ భాను, ఏఈవోలు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి



ర్యాలీలో సూపర్‌వైజర్ యామిని, అంగన్‌వాడీ కార్యకర్తలు

తెనాలి టౌన్: మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.యామిని పిలుపునిచ్చారు. రూరల్ మండలం తేలప్రోలు గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.యామిని మాట్లాడారు. మహిళల ఆరోగ్యం- ఎదుర్కొంటున్న సమస్యలు, పలు విషయాలపై సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీలు, లబ్ధిదారులు ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యవంతమైన మహిళ వికాసమే ధ్యేయంగా అందరూ కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహాలను నిర్మూలించడంలో అందరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ రజియా, షేక్ సుఫియా బేగం, ఎ.నాగరత్నం, షేక్ వహిదా పలువురు మహిళలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

తెనాలి అర్బన్: గర్భిణులు మంచి పోషక విలువల ఆహారాన్ని తీసుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక పేర్కొన్నారు. డీపీఎంవో జంగం శ్యామ్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి బాధితులను గుర్తించి వారికి చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో హెచ్‌వీ సీహెచ్ ప్రసన్న పుష్పలత, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కీలకం



మ్యూజికల్ చైర్స్ పోటీల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

తెనాలి టౌన్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ తెనాలి సీడీపీవో డాక్టర్ ఎం.సునీత సూచించారు. రూరల్ మండలం కఠెవరం కాల్వ కట్టపై గల ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లకు మ్యూజికల్ చైర్స్ పోటీలు జరిగాయి.

కార్మికుల సమస్యకు పరిష్కారం చూపండి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

తాడేపల్లిరూరల్: ప్రభుత్వాలు ఎన్ని మారినా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి, ఆయన ప్రారంభించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల సమస్య పరిష్కారం కోసం ముందుకు రావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. న్యాయ స్థానాలు కార్మికులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును పాలక పార్టీలు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. ఆశీర్వాదం, ఆర్. శివ, జానీ, అంకయ్య, శారద, రమాదేవి,సారమ్మ, దుర్గాభవాని, సామ్రాజ్యం , శివమ్మ, గురవయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.